క్లుప్తంగా

అభివృద్ధి పనుల పరిశీలన



కారిడార్ పనులు పరిశీలిస్తున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం : ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు పరిశీలించారు. శనివారం పాతూరు, గురుసార్వభౌమ సంస్కృత విద్యాపీఠం వైపు, ఎస్‌బీఐ బ్యాంకు వైపుగా కారిడార్ నిర్మాణాలు, షాపింగ్ కాంప్లెక్స్ పనులు తిలకించారు. పనుల నిర్మాణాల తీరును తెలుసుకుని పలు సూచనలు చేశారు. వేగంగా పనులు పూర్తి చేయాలని, శ్రీమఠం ప్రాంగణ వీధులన్నీ స్వర్ణశోభితంగా ఉండాలని సూచించారు.

ఈరన్నస్వామి సన్నిధిలో మంత్రి భరత్



మంత్రికి స్వాగతం పలుకుతున్న అర్చకులు

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామిని శనివారం రాష్ట్ర భారీ పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్ దర్శించుకున్నారు. స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కు తీర్చుకున్నారు. మంత్రికి ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజల అనంతరం మంత్రికి ఆలయ ప్రధాన అర్చకుడు ఈరప్పస్వామి శాలువాకప్పి, పూలమాలతో సన్మానించారు. తన కూతురు వివాహం వచ్చే నెల ఉండడంతో తమ ఇంటి దేవుడైన ఈరన్నస్వామిని దర్శించుకున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఉరుకుంద ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ చెన్నబసప్ప, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటపాటలతో కూడిన బోధన చేయాలి

నందవరం : అంగన్‌వాడీలోని చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య బోధన చేయాలని మండల విద్యాధికారి సుదర్శన్‌రెడ్డి సూచించారు. శనివారం మండల పరిధిలోని ముగతి మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లకు జ్ఞాన జ్యోతి మూడవ రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మూడేళ్ల నుంచి ఆరేళ్ల చిన్నారుల విద్య, అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో కేఆర్‌పీలు వెంకటరమణ, సీఆర్‌ఎంటీ ఉరుకుంద తదితరులు పాల్గొన్నారు.

షెడ్ల నిర్మాణాలు పూర్తి చేయండి

ఆదోని రూరల్: ఆదోని డివిజన్ పరిధిలోని ఆదోని, హొళగుంద, కౌతాళం, పెద్దకడబూరు మండలాల్లో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ల నిర్మాణాలను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని డీఎల్‌పీఓ నూర్జహాన్ అన్నారు. శనివారం స్థానిక డీఎల్‌పీఓ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ల నిర్మాణాల ఫంక్షనింగ్‌లోకి తీసుకురావాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఘనంగా గణిత దినోత్సవం



రామానుజన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

ఆదోని సెంట్రల్: స్థానిక పురపాలక ఉన్నత పాఠశాలలో గణిత దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున అధ్యక్షతన ఉపాధ్యాయులు గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన గణితం ఎగ్జిబిషన్ చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమంలో మ్యాథ్స్ ఉపాధ్యాయులు నిరంజన్, చంద్రశేఖర్, రమేష్‌రావు, జుబేర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని భాష్యం-2 పాఠశాలలో సీఈఓ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

డ్రైవర్ సేవా దృక్పథం



జీబ్రా లైన్ వేయిస్తున్న తిక్కన్న

ఆదోనిటౌన్: స్థానిక బస్టాండు ఎదురుగా ఉన్న స్పీడు బ్రేకర్లపై జీబ్రా లైన్‌లు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో ఇంద్రానగర్‌కి చెందిన డ్రైవర్ తిక్కన్న సొంత నిధులతో జీబ్రా లైన్‌ను శనివారం సాయంత్రం వేయించి సేవా దృక్పథం చాటుకున్నారు. కార్యక్రమంలో దర్గన్న, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

కౌతాళం: స్థానిక శివప్పనగర్‌లో జరుగుతున్న సిమెంటు రోడ్డు పనులను శనివారం ఎంపీడీఓ సుబ్బారాజు, పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాస రెడ్డితో కలిసి పరిశీలించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.15లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మిస్తున్నట్లు వారు తెలిపారు.

జగనన్నకు జనదీవెనలు

- ఘనంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు
- ఊరూరా, వాడవాడలా సంబరాలు
- పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు చేపట్టిన పార్టీ శ్రేణులు





కేకు కట్ చేస్తున్న ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్, కార్యకర్తలు, రాంపురంలో కేక్ పంచుతున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

ఆదోని టౌన్: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఆదోని నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. శనివారం వాడవాడలా, సందుసందున, గ్రామగ్రామానా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రైతులు, మహిళలు పెద్ద ఎత్తున జగనన్న జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద భారీ కేకును మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి కట్ చేశారు. ఎమ్మెల్సీ డా.మధుసూదన్‌తో పాటు నాయకులకు తినిపించి సంబరాలను జరుపుకున్నారు. నియోజకవర్గంలోని ప్రతి ఊరు, వాడ నుంచి జగనన్న అభిమానులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, యువత పెద్ద ఎత్తున ఆదోనికి తరలివచ్చి సంబరాలు జరుపుకున్నారు. అలాగే సేవా కార్యక్రమాలు చేపట్టారు.

నవరత్నాలు అందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కింది

నవరత్నాలు అనే సంక్షేమ పథకాల ద్వారా అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతిదీవెన, ఆరోగ్యశ్రీ, రైతుభరోసా, విదేశీ విద్య, నాడు-నేడు కింద ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులు నిర్మించి, పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించిన ఘనత జగనన్నకే దక్కిందని మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డా.మధుసూదన్ అన్నారు. చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు సూపర్‌సిక్స్ పథకాల పేరుతో అధికారంలోకి వచ్చి వాటిని అమలు చేయకుండా కాలయాపన చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. హామీలపై ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టడం, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్రంలో అత్యంత వెనకబడిన ఆదోని నియోజకవర్గంలో పేద ప్రజలు వైద్యం అందక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో జగనన్న మెడికల్ కళాశాలను మంజూరు చేశారన్నారు. ఆరేకల్ వద్ద మెడికల్ కళాశాల భవన నిర్మాణాలు పూర్తి అయ్యి, డాక్టర్లు, సిబ్బంది నియామకాలు జరిగినా కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలను వివిధ కారణాల చేత నిలిపివేయడం జరిగిందన్నారు. ఇంతకన్నా దారుణం ఏమైనా ఉందని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అనుసరించే విధానాలకు వ్యతిరేకంగా పోరాడదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు దేవా, పట్టణ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు నరసింహులు, గౌస్, సాంస్కృతిక విభాగ జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు ఫయాజ్, బాలాజీ, చలపతి, కిషోర్, ఇంతియాజ్, రఘునాథ్ రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, రామలింగేశ్వరయాదవ్, మహిళలు మంజుల, శ్రీలక్ష్మి, లక్ష్మి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇస్వీలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రక్తదానం

పట్టణంలోని ఎస్కేడీ కాలనీలో వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు 30 మంది రక్తదానం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

అన్నదానం

రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఆస్పరి రోడ్డులోని జీవనజ్యోతి అనాథాశ్రమంలో అనాథలకు అన్నదానం చేశారు. కడుపునిండా భోజనం చేసిన అనాథలు వైఎస్ జగన్ చల్లగా పది కాలాలపాటు ఉండాలని ఆశీర్వదించారు.



పెద్దకడబూరులో జగనన్న బర్త్‌డే వేడుకలో వై.ప్రదీప్‌కుమార్‌రెడ్డి

ఇస్వీలో....

ఆదోని మండలంలోని ఇస్వీ గ్రామంలో ఎమ్మెల్సీ డా.మధుసూదన్, సీనియర్ నాయకులు మహేంద్‌రెడ్డి, కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి, తాయన్నల ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి జగనన్న జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. భారీ కేకును కట్ చేసి కార్యకర్తలు, నాయకులు, గ్రామ ప్రజలకు పంచిపెట్టారు.

నిజాముద్దీన్ కాలనీలో.....

ఆదోని పట్టణం నిజాముద్దీన్ కాలనీలో కౌన్సిలర్ ఫయాజ్‌అహ్మద్ ఆధ్వర్యంలో జగనన్న జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.

గ్రామాల్లో ఘనంగా వేడుకలు

ఆదోని రూరల్: మండలంలోని నాగనాథనహళ్లి, ఢణాపురం, నారాయణపురం, సాదాపురం, బసరకోడు, మదిరె, కుప్పగల్, బల్లేకల్, జాలిమంచి, మదిరె, ఇస్వీ తదితర గ్రామాల్లో శనివారం వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. విరుపాపురం గ్రామంలో జెడ్పీటీసీ అరుణమ్మ, సర్పంచ్ ప్రహ్లాద్‌యాదవ్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

ఓటమికి బెదరని వ్యక్తిత్వం

మంత్రాలయం : రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిది ఓటమికి బెదరని వ్యక్తిత్వమని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ప్రదీప్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం రాంపురం స్వగ్రామంలో ఎమ్మెల్యే, పెద్దకడబూరులో వై.ప్రదీప్‌కుమార్ రెడ్డి నేతృత్వంలో వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. వేడుకలో భాగంగా పెద్దకడబూరులో ర్యాలీగా బయలుదేరి దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్దకు చేరుకున్నారు. అక్కడ మహానేతకు అంజలి ఘటించారు. అనంతరం ప్రధాన కూడలిలో కేక్ కట్ చేసి వేడుక చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాలు చేయడంలో జగనన్న ముందంజలో ఉన్నారన్నారు. ఐదేళ్ల పాటు ప్రజల తరపున పోరాటాలు సాగిస్తామని వెల్లడించారు. అధికార పార్టీ ఎన్ని కుయుక్తులు పన్నినా వెనకడుగు వేసేదిలేదని స్పష్టం చేశారు. వేడుకలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి, ముఖ్యనాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, రవిచంద్రారెడ్డి, శివారెడ్డి, సర్పంచులు చంద్రశేఖర్, మూకరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల మండలంలో ..

గోనెగండ్ల : మండలంలోని గోనెగండ్ల, అలువాల, హెచ్ కై రవాడి, పెద్దమరివీడు, గంజిహళ్లి, కులుమాల తదితర గ్రామాల్లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. గోనెగండ్లలో వైఎస్సార్ సర్కిల్‌లో మాజీ ఎంపీపీ కేవీ కృష్ణారెడ్డి, నాయకులు బందెనవాజ్, ఎస్‌బీ మన్సూర్, భాస్కర్ రెడ్డి, మురళీ నాయుడు, కాశీరెడ్డి, వైఎస్సార్‌సీపీ శ్రేణులు కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దొరబాబు, డాక్టర్ శివరాం, నాయుడు, ఖాజా పటేల్, రఘు, చికెన్‌రాజా, పద్మనాభం, నరేష్ రెడ్డి, పులికొండ, తదితరులు పాల్గొన్నారు.



గోనెగండ్లలో వైఎస్సార్ సర్కిల్‌లో కేక్‌కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నందవరంలో..



ముగతి సర్కిల్లో కేకును కట్ చేస్తున్న మండల వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, శివారెడ్డిగౌడ్, విరుపాక్షిరెడ్డి

నందవరం : మండలంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు వైఎస్సార్‌సీపీ నాయకులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. 167వ జాతీయ రహదారిలోని ముగతి సర్కిల్‌లో పార్టీ మండల కన్వీనర్ శివారెడ్డిగౌడ్, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంతరెడ్డి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు విరుపాక్షిరెడ్డి నేతృత్వంలో కేక్ కట్ చేసి వేడుకలు చేసుకున్నారు. వేడుకల్లో జెడ్పీటీసీ నిఖిల్‌చక్రవర్తి, ఎంపీటీసీలు విజయమోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రాఘవరెడ్డి, సుధాకర్, చాంద్‌బాషా, డీలర్ రాముడు తదితరులు పాల్గొన్నారు.

జనం మెచ్చిలా పథకాలందించిన నేత జగనన్న



ఎమ్మిగనూరులో దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎర్రకోట జగన్, బుట్టా శివనీలకంఠ



ఎమ్మిగనూరులో రక్తదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో బుట్టా శివనీలకంఠ, ఎర్రకోట జగన్మోహన్‌రెడ్డి, రుద్రగౌడ్, మున్సిపల్ చైర్మన్ రఘు

ఎమ్మిగనూరుటౌన్: జనం మెచ్చేలా సంక్షేమ పథకాలు అందించి మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సువర్ణ పాలన అందించారని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం కక్షలు సాధించేలా పాలన కొనసాగిస్తోందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు బుట్టా శివనీలకంఠ, పార్టీ రాష్ట్ర వీరశైవ లింగాయత్ అధ్యక్షుడు రుద్రగౌడ్, మున్సిపల్ చైర్మన్ రఘు అన్నారు. శనివారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను పట్టణంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సేవాకార్యక్రమాలు చేపట్టారు. స్థానిక దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి వారు పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సర్కిల్ సమీపంలో వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్ నిర్వహణలో కేక్‌కట్ చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. బుట్టా ఫౌండేషన్ నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో 61మందికి పైగా స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధికార ప్రతినిధి సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, బ్రెడ్లు, పండ్లను పంపిణీ చేశారు. అలాగే బుట్టాఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆస్పత్రికి 200ల కుర్చీలు, రోగుల కోసం దుప్పట్లను ఆస్పత్రి వైద్యులు బాలాజీకుమార్‌కు వారు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి లక్ష్మీకాంత రెడ్డి, ఎంపీపీ కేశన్న, జెడ్పీటీసీ భీమిరెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డ్ ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్, మాజీ మున్సిపల్ చైర్మన్ బుట్టారంగయ్య, శాప్‌నెట్ వర్క్ మాజీ చైర్మన్ మాచాని వెంకటేష్, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు ఎంకె శివప్రసాద్, భాస్కర్, టౌన్‌బ్యాంక్, కో ఆపరేటివ్ స్టోర్స్ మాజీ చైర్మర్లు యూకే రాజు, షబ్బీర్ అహమ్మద్, దయాకర్‌రెడ్డి, గోనెగండ్ల, నందవరం మండలాల నేతలు, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి



గోనెగండ్ల బస్టాండ్‌లో ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు.

గోనెగండ్ల : రాజ్యసభ సాక్షిగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను వెంటనే బర్తరఫ్ చేసి, జాతికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు జి.రంగన్న, సీనియర్ నాయకుడు మద్దిలేటి నాయుడు, రైతు సంఘం తాలూకా అధ్యక్షుడు మాలిక్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రం గోనెగండ్లలో ఎమ్మిగనూరు-కర్నూలు ప్రధాన రహదారిపై సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కులం, మతం, దేశభక్తి పేర్లతో తినే తిండి పైన, కట్టుకునే బట్టపై ఆంక్షలు విధిస్తూ ప్రజల మధ్య వైశ్యామ్యాలు రెచ్చగొట్టి ఒక ప్రణాళికాబద్ధంగా ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ మహిళలపై హింసను ప్రేరేపిస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రంగస్వామి, యునుస్, శ్రీరాములు, నరసింహులు, నాగరాజు, నబి, రాముడు పాల్గొన్నారు.

కౌతాళం: కేంద్ర మంత్రి అమిత్‌షాను వెంటనే బర్తరఫ్ చేయాలని కోరుతూ ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య, జైభీమ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, అవతారం, దళిత సమాఖ్య నాయకులు ప్రకాశ్, తిమోతి, రైతు కూలీ సంఘం మండల కార్యదర్శి జగదీష్, కౌతాళం సర్పంచ్ పాల్‌దినకర్, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆదోని రూరల్: కేంద్ర మంత్రి అమిత్‌షాను పదవి నుంచి తొలగించాలని మాల మహాసభ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, బొబ్బిలి, ఎంఐఎం ఆదోని ఇన్‌చార్జ్ జునైద్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని భీమాస్ సర్కిల్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. నాయకులు రమేష్, కల్లుబావి రవి, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు నరసన్న, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సపోస్ క్రిస్మస్

ఆదోని సెంట్రల్: పట్టణంలోని మిల్టన్ పాఠశాలలో శనివారం సపోస్ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ సీ.హెచ్ రమేష్ బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమలో సీఎస్ఐ హోలీ ట్రినిటీ చర్చి ఫాదర్ రెవ.ఇజ్రాయిల్ భరత్ బాబు పాల్గొని దైవ సందేశమిచ్చారు. పిల్లల నృత్య ప్రదర్శనలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ రమేష్ బాబు, ప్రిన్సిపాల్ బి.నాగరాజ్,డెవిడ్, దేవప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

ఆదోని టౌన్: వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి ఎస్.గోపాల్‌రెడ్డి ఎంపికవ్వడంతో శనివారం ఆయన మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ తనకు రెండో సారి అవకాశం కల్పించిన ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షులు ఎస్.వి.మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్సీ డా.మధుసూదన్‌ల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. నా చివరి శ్వాస వరకూ పార్టీ కోసం పాటుపడతానన్నారు.



మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డితో ఎస్.గోపాల్‌రెడ్డి

మౌంట్‌కార్మెల్ పాఠశాలలో విచారణ



విద్యార్థులను విచారిస్తున్న ఎంఈఓ-2 శోభారాణి

కోసిగి: స్థానిక మౌంట్ కార్మెల్ పాఠశాలలో ఎంఈఓ-2 శోభారాణి శనివారం విచారణ చేపట్టారు. బస్సు ఫీజు, పాఠశాల ఫీజులతో పాటు అదనంగా పాఠశాల వార్షికోత్సవం కోసం వసూళ్లకు పాల్పడుతూ.. విద్యార్థులను ఒత్తిడి చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు డీఈఓ శ్యాముల్ పాల్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు ఎంఈఓ-2 పాఠశాలకు చేరుకుని పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ జాన్సన్, విద్యార్థులు, తల్లిదండ్రులను విచారించారు. బస్సు ఫీజు చెల్లించలేదని సాయంత్రం పాఠశాల వదిలిన తర్వాత కర్రతో కొడుతున్నారని, క్రిస్మస్ గిఫ్ట్ కోసం, పాఠశాల వార్షికోత్సవం కోసం ప్రతి విద్యార్థి రూ.500 చెల్లించాలని పిల్లలపై ఒత్తిడి చేస్తున్నారని విచారణలో తేలింది. ఇందుకు సంబంధిత పాఠశాల యాజమాన్యం రాతపూర్వకంగా సంజాయిషీ ఇవ్వాలని ఎంఈఓ ఆదేశించారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలంటూ పాఠశాల యాజమాన్యాన్ని హెచ్చరించారు.

రజక వృత్తిదారులను ప్రోత్సహించాలి

ఆదోని సెంట్రల్: రజక వృత్తిదారులను ప్రొత్సహించడానికి గత ప్రభుత్వాలు ఇచ్చిన జీఓలను అమలు చేయాలని రజక కార్పొరేషన్ చైర్ పర్సన్ సావిత్రి కోరారు. శనివారం కర్నూలులో జిల్లా కలెక్టర్ రంజిత్ బాషాను కలసి వినతి పత్రం సమర్పించారు. జీఓ నంబర్.27 ప్రకారం ప్రభుత్వ కార్యాలయాల పరిధిలో ఉన్న ధోబీ పోస్టుల్లో రజక సామాజిక వర్గానికి చెందిన వారినే నియమించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి, పోలీసు, ఇతర ప్రభుత్వ శాఖల్లో బెడ్‌షీట్లు, యూనిఫామ్స్, దుస్తులు శుభ్రం చేసే పనుల్లో రజకులకు మాత్రమే అవకాశం కల్పించాలనికోరారు.

బదిలీల్లో అవకాశం ఇవ్వాలి

ఎమ్మిగనూరుటౌన్: వేసవి సెలవుల్లో నిర్వహించే బదిలీల్లో ఉపాధ్యాయులందరికీ అవకాశం కల్పించాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి టీకే జనార్దన్, మాజీ రాష్ట్ర కార్యదర్శి తిమ్మన్న, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మే 31వ తేదీని కటాఫ్ డేట్ తీసుకొని బదిలీలు నిర్వహిస్తే సీనియర్ ఉపాధ్యాయులు నష్టపోవలసి వస్తుందని తెలిపారు. నిబంధనను సవరించాలని కోరారు. నాయకులు బసవరాజు, నాగరాజు, రామచంద్ర, సురేష్ పాల్గొన్నారు.

క్రీడల్లో పాలిటెక్నిక్ విద్యార్థినుల ప్రతిభ

ఆదోని రూరల్: నంద్యాలలో జరిగిన 27వ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో భీమా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులు ప్రతిభ చాటినట్లు బిట్స్ ఇంజినీరింగ్ అండ్ పాలిటెక్నిక్ కళాశాల సెక్రటరీ పి.ఎస్.విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ జి.ఎస్.సురేంద్ర బాబు తెలిపారు. శనివారం స్థానిక కళాశాలలో ప్రతిభ చూపిన విద్యార్థినులను అభినందించారు. వారు మాట్లాడుతూ తమ కళాశాల నుంచి దీప్తి టేబుల్ టెన్నిస్‌లో ప్రథమ స్థానం, టేబుల్ టెన్నిస్ సింగిల్స్‌లో శిరీష ద్వితీయ స్థానం, 100 మీటర్ల పరుగు పందెంలో భావన రెండో స్థానం, ఎస్.చరిత తృతీయ స్థానంలో నిలిచారన్నారు.

మిరపకు గిట్టుబాటు ధర కల్పించాలి



మిరప పంటను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

కోసిగి: మిరప పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్ యాదవ్, ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్న గౌడ్, తాలూకా అధ్యక్షుడు గోపాల్ డిమాండ్ చేశారు. శనివారం కోసిగి మండలం కొల్మాన్‌పేట గ్రామంలో ఏఐకేఎస్ ఆధ్వర్యంలో మిరప పంటను పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. రైతులు అధిక పెట్టుబడి పెట్టుబడి పెట్టి సాగుచేకున్న మిర పంటలకు కనీసం పెట్టుబడులు రాని దుస్థితికి ఉందన్నారు. ప్రభుత్వం మిరపను మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటా కు రూ.25వేలకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 23న పెద్దకడబూరులో రైతు సదస్సు నిర్వహిస్తున్నామని, మిరప రైతులు అత్యధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. ఇందులో రైతు సంఘం జిల్లా సహాయక కార్యదర్శి మబ్బు, ఆంజనేయ, మంత్రాలయం మండల సీపీఐ కార్యదర్శి లక్ష్మన్ నాయక్, నాయకులు ఓంకార్ స్వామి, చంద్ర, తాయన్న, రైతులు పాల్గొన్నారు.

వలసజీవులను కాటేసిన విధి

- మూడు రోజుల వ్యవధిలోనే తాత, మనవడు మృతి
- శోకసంద్రంలో కుటుంబసభ్యులు

ఆదోని రూరల్: కూలీపోతే పూట గడవని పరిస్థితి ఆ కుటుంబానిది. ఓవైపు పేదరికం, మరోవైపు అనారోగ్య సమస్యలతో సతమతమవుతూ జీవనం సాగిస్తున్నారు. చేసిన అప్పులు తీర్చుకునేందుకు ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లి జీవనం గడుపుతున్నారు. ఉన్న ఊర్లో వృద్ధుడిని ఉంచి కుటుంబం మొత్తం గత నాలుగేళ్లుగా వలస వెళ్లి జీవనం సాగిస్తున్నారు. కాగా, ఆ కుటుంబంలో మూడు రోజుల వ్యవధిలో ఇద్దరు మృతిచెందడంతో విషాదఛాయలు అలుముకున్నాయి. మండలంని పెద్దతుంబళం గ్రామానికి చెందిన కొలకప్పగారి పెద్ద అయ్యన్న కుటుంబంతో సహా అనంతపురం వలసవెళ్లారు. మూడు రోజులక్రితం గ్రామంలో ఉన్న అతని తండ్రి కొలకప్పగారి చిన్న అయ్యన్న(60) అనారోగ్యంతో మరణించాడు. వారు దహన సంస్కారాలకై పెద్దతుంబళం గ్రామానికి వచ్చి శుక్రవారం ఉదయం అనంతపురం వెళ్లారు. పెద్ద అయ్యన్న, భార్య లింగమ్మకు ఇద్దరు ఆడపిల్లలు, ఇద్దరు మగ పిల్లలు సంతానం. అయితే చివరి సంతానమైన కొలకప్పగారి శివ(14) శుక్రవారం అనంతపురం జిల్లా కేంద్రంలో బాత్‌రూమ్‌లో ఉరి వేసుకుని మృతిచెందాడు. శివ ఐదో తరగతి వరకు చదువుకున్నాడు. పేదరికం కారణంగా చదువు వద్దు, మాతోపాటు వలస రావాలని తల్లిదండ్రులు శివను తమతో తీసుకెళ్లారు. తన అన్నతోపాటు సెంట్రింగ్ పనికి పంపించారు. అయితే శివకు ఆ పని చేయడం ఇష్టం లేదు. తాను ఈ పని చేయలేను, ఊరిలో వ్యవసాయ పనులకు వెళ్తానని తరుచుగా తల్లిదండ్రులతో చెప్పేవాడు. శివ మృతదేహాన్ని శనివారం గ్రామానికి చేర్చి దహన సంస్కారాలు పూర్తి చేశారు. మూడు రోజుల వ్యవధిలోనే తాత, మనవడు మృత్యు ఒడికి చేరుకోవడంతో ఆ కుటుంబంలో, గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

మిరపలో తెగుళ్లను నివారించుకోవాలి



రైతులకు సూచనలిస్తున్న ఉద్యాన అధికారి హరీంద్ర

ఆదోని రూరల్: మిరప పంటకు సోకే తెగుళ్లను నివారించుకోవాలని ఉద్యాన అధికారి హరీంద్ర రైతులకు సూచించారు. శనివారం సాయంత్రం మండలంలోని ఢణాపురం, నారాయణపురం, నాగనాథనహళ్లి గ్రామాల్లో సాగు చేసిన మిరప పంటలను పరిశీలించారు. మిరపలో తామర పురుగు, నల్లి నివారణకు పసుపు, నీలం రంగు, జిగురు అట్టలు ఎకరాకు 40 వరకు పెట్టుకోవాలని సూచించారు. వేపనూనె 3000 పీపీఎం, 2 మి.లీ. పిచికారీ చేసుకోవడం ద్వారా తామర పురుగు గుడ్లను అరికట్టవచ్చని చెప్పారు. పురుగు మందులను మార్చి మార్చి పిచికారీ చేసుకోవాలన్నారు. మిరపలో కాయమచ్చ, బూడిద తెగులు నివారణకు పొలంలో తేమశాతం తక్కువ ఉండేలా చూసుకోవాలన్నారు.

పూలచింతలో రెవెన్యూ సదస్సు

నందవరం : రైతులు భూ సమస్యలను పరిష్కారించుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. శనివారం మండల పరిధిలోని పూలచింత గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామంలో 12 అర్జీలు రైతులు సమర్పించారని తెలిపారు.